క్లుప్తంగా

నేడు సామూహిక గీతాపారాయణ

బోట్‌క్లబ్: స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు సామూహిక గీతాపారాయణ జరుగుతుందని నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హైందవి, సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులతో శత శ్లోక యువగీతలోని వంద భగవద్గీత శ్లోకాల పారాయణ జరుగుతుందన్నారు.

రేపు రాష్ట్ర బంద్‌కు సహకరించాలి



కరపలో విద్యార్థులతో కలసి రాష్ట్ర బంద్ పోస్టర్లు ప్రదర్శిస్తున్న జేఏసీ సభ్యులు

కరప: విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఈ నెల 8న తలపెట్టిన రాష్ట్రవ్యాప్త బంద్‌ను విజయవంతం చేసేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు సహకరించాలని స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పి.బుల్లిరాజు, మండల ఎస్ఎఫ్ఐ కార్యదర్శి సంజయ్ కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు చేస్తున్న ఉద్యమం వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను ఆపాలని, కడపలో ఉక్కు పరిశ్రమను స్థాపించాలని కోరుతూ రాష్ట్ర బంద్ తలపెట్టామన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలను కలసి రాష్ట్ర బంద్ గురించి వివరించి, సెలవు ప్రకటించి బంద్‌కు సహకరించాలని కోరారు. జేఏసీ సభ్యుడు వి.మురళి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా

కాకినాడ సిటీ: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 8న ఉదయం 10 గంటలకు ఎస్‌బీ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎల్ఐసీ అండ్ పేటీఎంలో పలు ఉద్యోగాల కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఎల్ఐసీలో ఇన్సూరెన్స్ అడ్వయిజర్, ఏజెన్సీలకు 310 ఉద్యోగాలు ఉన్నాయన్నారు. దీనికి ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులు రాజమహేంద్రవరం, తుని, పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ, అమలాపురంలలో పని చేయాల్సి ఉంటుందన్నారు. వీరికి రూ. 5 వేల జీతం, కమీషన్ ఇస్తారన్నారు. అదేవిధంగా ఎస్‌బీ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో టెలీ కాలర్స్, సిస్టమ్ స్పెషలిస్ట్స్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ 21 ఉద్యోగాలకు అర్హులను ఎంపిక చేస్తారన్నారు. దీనికి ఏదైనా డిగ్రీ చదివి హార్డ్‌వేర్ అండ్ నెట్ వర్కింగ్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. వీరికి నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ జీతం ఇస్తారన్నారు. పేటీఎంలో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్‌గా 120 మందికి ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. ఎస్ఎస్‌సీ ఆపై చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి రూ.15,500 నుంచి రూ.21 వేల వరకూ జీతం ఇస్తారని శ్రీనివాసరావు వివరించారు.

రేపు వినాయకుని కల్యాణోత్సవం

బోట్‌క్లబ్: కాణిపాక వరసిద్ధి వినాయకుని ఆలయ ఉత్సవ విగ్రహాలు, ఆలయ పురోహితులతో బుధవారం ఉదయం 8 గంటలకు కాకినాడ బాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయకుని కల్యాణోత్సం నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ పెద్ది రత్నాజీ, ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. కాణిపాకం ఆలయ కమిటీ చైర్మన్ అగరం మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్త కంతేటి కాశీ సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సేవ్ టెంపుల్స్ చైర్మన్ గజల్ శ్రీనివాస్, కాకినాడ ఎంపీ వంగా గీత, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పాల్గొంటారన్నారు. స్వామివారికి అత్యంత వైభవంగా జరిగే హోమం, కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

కేంద్ర విధానాలతో రాష్ట్రానికి అన్యాయం

కాకినాడ సిటీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేస్తుంటే రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నించడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం, మంతెన సీతారామ్ అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజారక్షణ భేరి రాష్ట్ర బస్సు యాత్ర ఆదివారం రాత్రి కాకినాడకు చేరుకుంది. సోమవారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. విభజన హామీలు అమలు చేయకుండా, రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధరనూ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అసమానతలు లేని ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి కోసం ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రక్షణభేరి సభకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని వారు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు ఏవీ నాగేశ్వరరావు, కె.ధనలక్ష్మి, సూరిబాబు ఎం.రాజశేఖర్, కేఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన ప్రచారం

కరప: నడకుదురులో సోమవారం మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి టీడీపీ, జనసేన పార్టీల నాయకులతో కలసి పర్యటించారు. ఉమ్మడి మేనిఫెస్టోను ఇంటింటికీ పంచారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పెనుగుదురులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి



తిమ్మాపురం నుంచి భారీగా జనాలతో తరలివస్తున్న సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ



సభలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కదలివచ్చిన జన కడలిలా..

- పండగలా సామాజిక సాధికార బస్సుయాత్ర
- జన సంద్రంలా సర్పవరం జంక్షన్
- పేదల పక్షపాతి సీఎం జగన్: ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: కడలిలా కదలివచ్చారు.. ఉవ్వెత్తున ముందుకు సాగారు.. సర్పవరం జంక్షన్‌కు వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు భారీగా తరలివచ్చారు.. సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేశారు. రూరల్ నియోజకవర్గంలో సర్పవరం జంక్షన్ వద్ద ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అధ్యక్షతన సోమవారం సాయంత్రం సామాజిక సాధికార బస్సు యాత్ర బహిరంగ సభ జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు హాజరయ్యారు. పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి ప్రారంభోపన్యాసంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడారు. ఇదో చారిత్రాత్మకమైన రోజని, పండగ వాతావరణంలో సామాజిక సాధికార బస్సుయాత్ర సభను జరుపుకొంటున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ముఖ్యంగా సామాజిక సాధికారతకు అర్థం చెప్పేలా పాలన అందిస్తున్నారన్నారు. అన్నివర్గాల ప్రజలు రాష్ట్రంలో సుభిక్షంగా ఉన్నారని, మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందుతున్నారన్నారు. నియోజకవర్గంలో సుమారు రూ.800 కోట్లను వివిధ పథకాల కింద లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేశారన్నారు. లబ్ధిదారుల్లో 90 శాతం వరకూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందినవారు ఉన్నారన్నారు. రాష్ట్రంలో సుమారు 2.50 లక్షల కోట్ల పైచిలుకు మొత్తాన్ని డీబీటీ కింద నేరుగా లబ్ధిదారులకు వేశారన్నారు. పథకాలను సీఎం సమర్థంగా అమలు చేస్తున్నారన్నారు.

దమ్మున్న నాయకుడు జగన్

కరోనా వంటి ఒడుదొడుకులు వచ్చినా, ఎవరు ఎన్నికుయుక్తులు పన్నినా దమ్మున్న నాయకుడిలా దేశంలోనే మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని కన్నబాబు అన్నారు. ఈ రోజుకు ఒక ప్రత్యేకత ఉందని, సరిగ్గా ఆరేళ్ల కిందట ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించారన్నారు. ఆ పాదయాత్ర ఈ రాష్ట్ర చరిత్రనే మలుపు తిప్పిందన్నారు. చంద్రబాబు రాజమహేంద్రవరం జైలు నుంచి బెయిల్‌పై వెళ్తూ తనకు సరిగా కంటిచూపు కనబడడం లేదని, మళ్లీ జైలుకు వస్తానని చెప్పి వెళ్లాడని, కానీ ఆయనకు దృష్టిలోపం ఉందని ప్రజలు ఎప్పుడో గమనించారన్నారు. ఆయనకు సొంత మనుషులు, సొంత పెత్తందారులు మాత్రమే కనపడతారన్నారు. 2014లో పార్టీ పెట్టిన పవన్‌కల్యాణ్ నేరుగా చంద్రబాబు కోసమే పనిచేస్తూ ఆ రోజు చంద్రబాబుకు మద్దతుగా నిలబడ్డారన్నారు. ఆ తరువాత 2019లో వ్యతిరేక ఓట్లు చీలిపోకూడదని చంద్రబాబుకు తన బీఫారాలు అప్పగించి, మళ్లీ ఇప్పుడు వచ్చి జతకట్టాడన్నారు. నాయకులు కురసాల సత్యనారాయణ, కల్యాణకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, తులసీరామ్, జమ్మలమడక నాగమణి, రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, సుంకర శివప్రసన్న, అనుసూరి ప్రభాకర్, సర్పంచ్‌లు బెజవాడ సత్యనారాయణ, రామదేవు చిన్న, శీరం నాగేశ్వరరావు, పెంకే ఆనందకుమార్, జంగా గగారిన్, గీసాల శ్రీను, గుల్లా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఉవ్వెత్తున తరలివచ్చారు..

కరప: కాకినాడలోని సర్పవరం జంక్షన్ వద్ద రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో తలపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర, బహిరంగ సభకు కరప మండలం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు, అభిమానులు వేలాదిగా తరలివెళ్లారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, వైస్ ఎంపీపీలు బొమ్మిడి వీర్రాఘవులు, పాట్నీడి భీమేశ్వరరావు, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కోట శ్రీనివాసరావు, మండల బీసీ నాయకులు పెంకే సత్తిబాబు, కాదా వెంకటేశ్వరరావు, పైలా గోవిందు, రెడ్డి శ్రీనివాస్, బొమ్మిడి సతీష్, ఎస్సీ నాయకుల ఆధ్వర్యంలో సాధికార యాత్రకు బస్సులు, ఆటోలు, మోటార్ సైకిళ్లపై ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ఏ గ్రామానికి వెళ్లినా జై జగన్, జైజై జగన్ అంటూ, కన్నబాబు నాయకత్వం వర్ధిల్లాలనే నినాదాలు మార్మోగాయి. కరప పరిసర గ్రామాల ప్రజలు పంచాయతీ వద్దకు చేరుకోగా మండల పార్టీ అధ్యక్షుడు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అక్కడి నుంచి పెనుగుదురు వంతెన వద్దకు చేరుకున్నారు. ఇక్కడ దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంస్య విగ్రహానికి ఎంపీపీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెనుగుదురు పరిసర గ్రామాల నుంచి వచ్చిన బైక్, ఆటోలను కలుపుకొని ర్యాలీగా కాకినాడలో ఎమ్మెల్యే కన్నబాబును కలసి సర్పవరం జంక్షన్ వద్ద సాధికార యాత్ర సభా స్థలికి చేరుకున్నారు. సర్పంచులు సాదే ఆశాజ్యోతి, వాసంశెట్టి శ్రీనుబాబు, పలివెల నాగేశ్వరరావు, మారెళ్ల శివ, అనసూరి శ్రీనివాసరావు, వాసంశెట్టి రామారావు తదితరులు ఉన్నారు.



మది నిండా జగనే: జగనన్న మాస్కులతో అతివల సందడి



అభిమాన కెరటం: సీఎం జగన్ కటౌట్‌తో కార్యకర్త



విజయఢంకా: ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక ప్రదర్శన



మన జెండా మళ్లీ ఎగరాలి: సభకు తరలివస్తున్న శ్రేణులు

తిరుమలకు వైఎస్సార్ సీపీ నేతల పయనం



తిరుమలకు పయనమైన ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులు

కాకినాడ: సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి ఆధ్వర్యంలో నగర వైఎస్సార్ సీపీ నేతలు సోమవారం తిరుమలకు పయనమయ్యారు. 2019 ఎన్నికల ముందు వైఎస్సార్ సీపీ విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే క్యాడర్‌తో తిరుమల వస్తామన్న మొక్కును తీర్చుకునే క్రమంలో ఈ పర్యటన ఏర్పాటు చేసుకున్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మహాలక్ష్మి దంపతులతో పాటు పలువురు మాజీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు సోమవారం ఉదయం తిరుమలకు వెళ్లారు. మంగళవారం తిరుపతి నుంచి తిరుమలకు కాలినడకన వెళ్లి స్వామివారి దర్శనం చేసుకుని బుధవారం తిరిగి నియోజకవర్గానికి వస్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అనుకున్న మేరకు సింహాచలం పాదయాత్ర చేశామని, తిరుమల వెళ్లాల్సి ఉండగా కరోనా కారణంగా జాప్యం జరిగిందన్నారు.

ప్రతి అర్జీని సత్వరం పరిష్కరించండి

కమిషనర్ నాగ నరసింహారావు ఆదేశం



స్పందనలో ప్రజల వినతులు పరిశీలిస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమంగా నిర్వహిస్తున్న స్పందన, డయల్ యువర్ కమిషనర్‌లో వచ్చిన ప్రతి అర్జీని సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు అధికారులను ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకూ డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పది మంది పలు సమస్యలను ఫోన్‌లో కమిషనర్‌కు తెలిపారు. ఇంజినీరింగ్, పారిశుధ్యం, గృహ నిర్మాణం, టౌన్ ప్లానింగ్ విభాగాలకు సంబంధించి ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకూ రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా ఫిర్యాదులు అందజేయవచ్చని చెప్పారు. అనంతరం జరిగిన స్పందన కార్యక్రమానికి 11 దరఖాస్తులు వచ్చాయి. వీటికి కూడా నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని కమిషనర్ సూచించారు. నిర్దిష్ట గడువులోగా పరిష్కరించి ఆ సమాచారాన్ని ఫిర్యాదుదారులకు తెలియజేస్తామన్నారు. ఈ సందర్భంగా డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాల ద్వారా వచ్చిన దరఖాస్తులు– పరిష్కారంపై అధికారులతో కమిషనర్ సమీక్షించారు. నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఏసీపీ నాగశాస్త్రులు, ఈఈ వెంకట్రావు, మాధవి, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ సిబ్బంది నిరసన



నిరసన తెలుపుతున్న జీజీహెచ్ సిబ్బంది

కాకినాడ క్రైం: యాజమాన్యం మారుతుందంటూ ప్రచారం జరగడంతో జీజీహెచ్ సెక్యూరిటీ, శానిటేషన్ విభాగాల్లో అలజడి రేగింది. సుమారు 600 మంది సిబ్బంది యాజమాన్య మార్పును నిరసిస్తూ విధులు బహిష్కరించారు. సోమవారం జరిగిన ఈ సమ్మె కారణంగా ఆసుపత్రిలో సేవలకు ఆటంకం కలిగింది. సకాలంలో జీతాభత్యాల విడుదల, పీఎఫ్, ఈఎస్ఐ గతంలో ఏనాడు అమలు కాలేదని, ప్రస్తుతం సమస్యలన్నీ పరిష్కారమై, ప్రయోజనాల అందజేత నిరాటంకంగా కొనసాగుతున్న నేపథ్యంలో యాజమాన్య మార్పు తమ ఉద్యోగ భవితవ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపనుందని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. వీరి నిరసనకు సీఐటీయూ నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, కోశాధికారి మలక వెంకటరమణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్‌లు తమ సంఘాల తరఫున మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కార్మికుల న్యాయపరమైన డిమాండ్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మధ్యాహ్నం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి సిబ్బందితో చర్చించారు. ఒప్పంద వర్గాలతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆమె హామీతో సిబ్బంది సమ్మె విరమించి విధుల్లో చేరారు. అనంతరం డాక్టర్ లావణ్యకుమారి ఆసుపత్రిలో రేగిన అలజడిని ఒప్పంద యాజమాన్య ఉన్నత వర్గాలు, ప్రభుత్వ విభాగాలకు తెలియజేశారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై దిశానిర్దేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కృతికా శుక్లా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ఉద్దేశం, వైద్య శిబిరాల నిర్వహణ, సురక్ష ఐదో దశలో అధికారులు చేపట్టాల్సిన చర్యలు, ఫ్యామిలీ డాక్టర్ విధానం విలేజ్ క్లినిక్‌లకు అనుసంధానం చేయడం, ఆరోగ్యశ్రీ పథకం కింద రిఫర్ చేసిన ప్రత్యేక కేసులకు నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా అందించాల్సిన వైద్య సేవలు తదితర అంశాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జె.నరసింహనాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య, ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్ స్వప్న, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త పి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలల దినోత్సవ కార్యక్రమాలు ప్రారంభం



జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ బాదం బాలకృష్ణ

బాలాజీచెరువు: స్థానిక లయన్స్ క్లబ్ హాలులో నగర క్లబ్ అధ్యక్షుడు డి.రామసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బాలల దినోత్సవ కార్యక్రమాలను ముఖ్య అతిథి లయన్స్ పూర్వపు జిల్లా గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధైర్యంగా కలలు కనండి అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారని, దీనిని లయన్స్ ఇంటర్నేషనల్ పేస్ పోస్టర్ కాంటెస్ట్ పేరున ప్రపంచ వ్యాప్తంగా 212 దేశాల్లో నిర్వహించి ప్రథమ బహుమతిగా 2,500 డాలర్లు, విద్యార్థి, విద్యార్థి తరఫున ఇద్దరిని అమెరికా తీసుకువెళ్లి బహుమతి ప్రదానం చేస్తారని, ఇదే కాకుండా 500 డాలర్ల చొప్పున 23 కన్సోలేషన్ బహుమతులు ఉంటాయన్నారు. ఉమ్మడి జిల్లాలో వివిధ క్లబ్‌ల నుంచి వచ్చిన వాటిలో మొదటి మూడు ఎంపిక చేసి మొదటి బహుమతిగా రూ.10వేలు, రెండో బహుమతిగా రూ.5 వేలు, మూడో బహుమతిగా రూ.3 వేలు అందిస్తారన్నారు. మంగళవారం నుంచి 14వ తేదీ వరకూ లయన్స్ క్లబ్ హాలులో మెడికల్ ప్లాంట్స్ గురించి వివరించే పోటీ, వక్తృత్వ పోటీలు, చెస్, క్విజ్, 4వ తరగతి లోపు చదువుతున్న పిల్లల ఫ్యాషన్ షో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్ పీవీ సుబ్బారావు, సెక్రటరీ ఐహెచ్ఎస్‌కే శ్రీనివాస్, ఎంవీ శాస్త్రి, మేడిశెట్టి వెంకటరమణ, జీసీ జగన్నాథరావు, నేరెళ్ల మురళి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యం పెంచుకోవాలి



కుట్టు శిక్షణ కేంద్రానికి మెషీన్లు అందజేస్తున్న దాతలు, అతిథులు

బాలాజీచెరువు: విద్యార్థులకు చదువుతో పాటు వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు మెగా లెజెండ్స్ స్థానిక పీఆర్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో కుట్టుశిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా సీసీఎస్ డీఎస్పీ రాంబాబు అన్నారు. స్థానిక బాలాజీచెరువు సెంటర్‌లోని పీఆర్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మెగా లెజెండ్స్ సోషల్–కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. దీనికి మెగా లెజెండ్స్ సంస్థ అధ్యక్షుడు భీమేశ్వరరెడ్డి అధ్యక్షత వహించగా రాంబాబు ముఖ్యఅతిథిగా, రోటరీ క్లబ్ గోల్డెన్ జూబ్లీ హ్యాపీ స్కూల్స్ ప్రాజెక్ట్ చైర్మన్ చిరంజీవిరెడ్డి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. తొలుత శిక్షణను డీఎస్పీ రాంబాబు ప్రారంభించారు. మెగా లెజెండ్స్ సంస్థ ప్రధాన కార్యదర్శి రెడ్డి మంజులా, ఉపాధ్యక్షుడు గుబ్బల సత్యనారాయణ సంస్థ ముఖ్యోద్దేశాలను వివరించారు. శిక్షణ కేంద్రానికి కుట్టుమెషీన్లు అందించిన దాతలు టీవీ ఫణీకుమార్ దంపతులు, కె.మంగతాయారు, డాక్టర్ అడపా సూర్యనాగభవానీ, సబ్బినీడి రామకృష్ణ, సాయిచరణ్, వాసవీలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అతిథులు డీఎస్పీ రాంబాబు, చిరంజీవిరెడ్డి, ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి ఆలయం ఆస్థాన వేదపండితుడు టీవీ ఫణీకుమార్, కుట్టు మెషీన్లను బహూకరించారు. స్కూల్ హెచ్ఎం కేవీవీ సత్యనారాయణ, ఆర్గనైజేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గుబ్బల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రెడ్డి మంగతాయారు, ట్రెజరర్ ఆర్‌డీ ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివకుమార్ రెడ్డి, కల్చరల్ సెక్రటరీ పీఎస్ సురేఖప్రియ తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల కిటకిట

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతైన రోజు కావడంతో తెల్లవారు జాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి తొలిపూజ, తొలి అభిషేకాలను తిలకించడానికి బారులు తీరారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో తొలిపూజను ఆలయ పండితులు నిర్వహించారు. ఆలయంలో ఉన్న ఉపాలయాల్లోనూ పూజలు చేశారు. సాయంత్రం స్వామివారిని, అమ్మవార్లకు ప్రత్యేకాలంకరణ చేశారు. ఆలయ ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, కొంతేటి జోగారావు, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు వినయ్, చంటి తదితరులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో కొమరగిరిలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అన్నారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో హౌసింగ్, మెప్మా కార్పొరేషన్ అధికారులతో గృహ నిర్మాణాల ప్రగతిపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలను వేగవంతం చేసే క్రమంలో లబ్ధిదారుల వాటా సొమ్ము వేగంగా సమకూర్చుకునేలా అవగాహన కల్పించాలన్నారు. టిడ్కో పథకంలో ఇళ్లు మంజూరు కాని లబ్ధిదారులకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీ, ఇతర నిధులు పోను సుమారు రూ.45 వేలు సమకూర్చుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ సొమ్మును సిద్ధం చేసుకుంటే కొమరగిరి లేఅవుట్‌లో నిర్మాణాలు వేగవంతమవుతాయన్నారు. ఇతర లబ్ధిదారులకు సంబంధించి కూడా వాటా సొమ్ము విషయమై ప్రత్యేకాధికారులు దృష్టి సారించాలన్నారు. అవసరమైతే వాటా సొమ్ము కోసం ఆర్థిక సంస్థల ద్వారా రుణాన్ని సమీకరించే అంశంపై తోడ్పాటు అందిస్తామన్నారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, గృహ నిర్మాణ శాఖ ఈఈ శ్రీనివాస్, డీఈలు గుప్త, సత్యనారాయణరెడ్డి, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, మెప్మా సీఎంఎం డేగల వెంకటరాజు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు వెలకట్టలేనివి



కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు, వైద్యులు, విద్యార్థులు

కాకినాడ క్రైం: వైద్యుల సేవలు వెలకట్టలేనివని నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాల జనరల్ సర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్కే ఖాలీషా సాహెబ్ అన్నారు. సోమవారం స్థానిక రంగరాయ వైద్య కళాశాల ఆడిటోరియంలో వైద్య రంగంపై అవగాహన కోసం వైద్య విద్యార్థులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ఆయనతో పాటు ప్రముఖ రేడియాలజిస్టు, సత్య స్కాన్ అండ్ డయాగ్నస్టిక్స్ అధినేత కాదా వెంకటరమణ ముఖ్య వక్తలుగా హాజరయ్యారు. డాక్టర్ ఖాలీషా మాట్లాడుతూ వైద్య సేవలకు కులమతాలు లేవని అన్నారు. రంగరాయ పూర్వపు విద్యార్థిగా గర్వపడుతున్నానని చెప్పిన డాక్టర్ ఖాలీషా కళాశాల కీర్తిని ఇనుమడింపజేయాలని విద్యార్థులకు ఉద్బోధించారు. డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ వైద్యుడిగా సమాజంలో మెలగాల్సిన తీరు, సామాజిక జీవనంలో ఇమిడాల్సిన విధానాలను విశదీకరించారు. ఆర్ఎంసీ సైకియాట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వానపల్లి వరప్రసాద్ మాట్లాడుతూ మెడికల్ స్టూడెంట్స్ నెట్‌వర్క్ ఐఎంఏలో ప్రతి వైద్య విద్యార్థి తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవీమాధవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్లు పవన్, కిరణ్, జవహర్, ప్రసన్న, భాగ్యలక్ష్మి, లక్ష్మి, శశి, ఉమ, శర్మ పాల్గొన్నారు.